నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, ఆదివారం 1 జూన్ 2025 RANGAREDDY


## తహసీల్దార్ల బదిలీ

**ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నతాధికారులు**

వికారాబాద్, మే 31 : వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. దోమ తహసీల్దార్ పురుషోత్తంను మర్పల్లి తహసీల్దార్‌గా.. మర్పల్లి తహసీల్దార్ మునిరోద్దీన్‌ను కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అదేవిధంగా వెయిటింగ్‌లో ఉన్న తహసీల్దార్ రవీందర్‌ను మోమిన్‌పేటకు, మోమిన్‌పేట తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి కులకచర్లకు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న బుచ్చయ్య, వెంకటస్వామి, వహీద్ ఖాతున్, షాషీదా బేగంలు తహసీల్దార్లుగా నవాబుపేటకు, యా లాలకు, చౌడాపూర్‌కు, బషీరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా ఉన్న గోవిందమ్మను దోమకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# రిజర్వాయర్ వద్దు.. భూములను లాక్కోవద్దు

- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ప్రభుత్వం భూములను తీసుకుంటే రోడ్డున పడతామని ఆందోళన
- భూమికి భూమి లేదా ఎకరానికి రూ. కోటి చెల్లించాలని డిమాండ్

## తేల్చి చెప్పిన ఇర్విన్ గ్రామ రైతులు



రిజర్వాయర్ నిర్మాణానికి తమ భూములను తీసుకోవద్దని రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఇర్విన్ గ్రామ రైతులు




రంగారెడ్డి, మే 31 (నమస్తే తెలంగాణ) : రిజర్వాయర్ వద్దు.. మాకు పొలాలే కావాలంటూ శనివారం మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామ రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. తాతల కాలం నుంచి ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామని ..రిజర్వాయర్ నిర్మాణానికి ఆ భూములను తీసుకుంటే తాము రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల్లో రిజర్వాయర్ వద్దే..వద్దంటూ తాము పలు రకాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని.. రూ.కోటి విలువ చేసే భూమికి సర్కార్ కేవలం 8,00,000 మాత్రమే ఇస్తుందని.. రైతుల అంగీకారం లేకుండానే ప్రభుత్వం ఆ భూములను తీసుకొని రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి ఎనిమిది లక్షల చొప్పున జమ చేస్తున్నదని మండిపడ్డారు. రిజర్వాయర్ పూర్తైతే రామపురం నల్ల చెరువు ఇరువైపులా ఉన్న గ్రామాల్లోని రైతులు సుమారు వెయ్యి ఎకరాల వరకు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశా రు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకోగానే.. వద్దని ప్రభుత్వ పెద్దలను కలిస్తే..ఆ ప్రతిపాదనను విరమించుకుని దాని స్థానంలో పంప్‌హౌస్‌ను నిర్మిస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రిజర్వాయర్ నిర్మాణం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందని.. రిజర్వాయర్ కోసం రాత్రి సమయాల్లో డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఆదుకుంటాడని భావించిన రేవంత్‌రెడ్డి తమను నిలువునా ముంచాలని చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భూమికి బదులుగా భూమి ఇవ్వాలి



రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దు చేసి రైతులను ఆదుకోవాలి. లేని పక్షంలో భూమికి బదులు భూమి ఇవ్వాలి. తమ తాతలు, తండ్రులు ఈ భూములనే నమ్ముకొని జీవించారు. మేము కూడా ఈ భూము ల్లో పంటలు పండించుకుని బతుకుతున్నాం. భూములు తీసుకొని మమ్మల్ని రోడ్డుపాలు చేయొద్దు. రిజర్వాయర్ నిర్మాణంతో మాకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. కొంతమంది పెద్దల ప్రయోజనాల కోసమే దానిని నిర్మిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రిజర్వాయర్ నిర్మాణాన్ని రద్దు చేయాలి.

**- కడారి అల్లాజీ**

### ఎకరానికి రూ. ఎనిమిది లక్షలేనా..?

ఇర్విన్ గ్రామ పరిసరాల్లో ఎకరానికి రూ. కోటి వరకు ధర పలుకుతున్నదని.. కానీ, ప్రభుత్వం ఎకరం భూమికి రూ. 8,00,000 నష్టపరిహారం కింద చెల్లిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ కోసం తమ భూములను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తే.. భూమికి బదులు భూమి ఇవ్వాలని లేకుంటే.. బయట మార్కెట్లో ఉన్న ధర ప్రకారం ఎకరానికి రూ. కోటి వరకు చెల్లించడంతోపాటు ఇంటికొక ఉద్యోగం, ఇండ్ల స్థలం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయకుండా భూములను బలవంతంగా తీసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు హెచ్చరించారు.

### భూమి లేకపోతే మా పిల్లలకు పెళ్లిళ్లు కావు..



గ్రామాల్లో భూమి ఉంటేనే విలువ ఉంటుంది. కానీ, ప్రభుత్వం నాకున్న మూడు ఎకరాలను తీసుకోవాలని చూస్తున్నది. భూమి లేకపోతే మా పిల్లలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవించాలి వస్తుంది. అంతేకాకుం డా పిల్లను కూడా ఇవ్వరు. భూములను మా నుంచి విడదీయొద్దు. ముఖ్యమంత్రి మా గోడు విని న్యాయం చేయాలి.

**-అంజమ్మ రైతు**

# నిర్వాహకుల మాయాజాలం



కాశీంపూర్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో వాదిస్తున్న రైతులు

- తాలు, తేమ పేరుతో అదనపు తూకం
- నిబంధనలు పట్టించుకోని అధికారులు
- కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో అన్నదాత నిలువు దోపిడీ

బషీరాబాద్, మే 31 : మిల్లర్ల పేరు చెప్పి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మోసం చేస్తున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తేమ, తాలు పేరుతో కిలోన్నర ధాన్యాన్ని ఎక్కువగా తూకం చేశారని, ఈ లెక్కన 300 క్వింటాళ్ల ధా న్యాన్ని అదనంగా సేకరించారని.. ఈ 300 క్వింటాళ్ల ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,320తో లెక్కిస్తే దాదాపు రూ. 6,96,000 అవుతుందని, ఈ డబ్బంతా ఎవరి జేబులోకి వెళ్లిందని ప్రశ్నిస్తున్నారు. కాశీంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో బస్తాకు 42 కిలోల 500 గ్రాముల ధా న్యాన్ని తూకం చేస్తూ బస్తాకు కిలోన్నర ధాన్యా న్ని అదనంగా తీసుకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు.

### ప్రభుత్వ నిబంధనల ప్రకారం ..

నిబంధనల ప్రకారం తేమ శాతం 17 ఉంటే బస్తాకు 40 కిలోల600 గ్రాముల ధాన్యాన్ని తూకం చేయాలి. అలా కాకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తాలు, తేమ పేరుతో 42 కిలోల 500 గ్రాముల ధాన్యాన్ని అదనంగా తూకం చేస్తున్నారు. ఇదేంటని వారిని ప్రశ్నిస్తే.. మీ వడ్లు బాగా లేవు..రైస్‌మిల్లుల వారు తీసుకోరని చెబుతున్నారని అన్నదాతలు వాపోతున్నారు. లేదంటే తూకం చేయకుండా రోజుల తరబడి అలాగే ఉంచుతున్నారని.. దీంతో చేసేదేమీ లేక కేంద్రం నిర్వాహకులు చెప్పినట్లే చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

### 20 వేల బస్తాల సేకరణ..

కాశీంపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రం ద్వా రా ఇప్పటివరకు దాదాపు 20,000 ధాన్యం బస్తాలను సేకరించినట్లు నిర్వాహకులు తెలిపా రు. ఇంకా కేంద్రంలో 6,000 బస్తాల వరకు ధా న్యం ఉంటుందని పేర్కొంటున్నారు. కాగా, 20,000 బస్తాలకు కిలోన్నర చొప్పున అదనం గా ధాన్నాన్ని లెక్కిస్తే 300 క్వింటాళ్లు వస్తుంది.

### క్వింటాకు 7 కిలోలు తీస్తారంట..



తనతోపాటు మరో ఎనిమిది మంది రైతులకు సంబంధించిన ధాన్యాన్ని గత నెల 23 వ తేదీన నిర్వాహకులు లారీలో రైస్‌మిల్లుకు తరలించారు. మూడు రోజుల తర్వా త బిల్లు కోసం నిర్వాహకుల వద్దకు వెళ్తే.. మీ ధాన్యం మంచిగా లేదని, మిల్లర్లు తీసుకోవడంలేదని చెప్పడమే కాకుండా.. క్వింటాకు ఏడు కిలోల చొప్పున ధాన్యాన్ని కట్ చేసి బిల్లు చేస్తామన్నారు. బస్తాకు కిలోన్నర కాకుండా మళ్లీ ఏడు కిలోలు కట్ చేస్తే ఒప్పుకునేది లేదని చెప్పి తిరిగి వచ్చేశాం.

**-బాబు షరీఫ్ కాశీంపూర్**

### ధాన్యం 17% తేమ వచ్చినా..



నా ధాన్యం 17% తేమ వచ్చినా 42 కిలో ల 500 గ్రాముల చొప్పున తూకం చేశారు. ఎందుకు అని అడిగితే ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకో అని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ధాన్యాన్ని తూకం వేసేందుకు 15 రోజుల కిందట తీసుకొచ్చా. కొనుగోళ్లలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి సిబ్బంది పట్టించుకోవడంలేదు.

**విఠల్, రైతు, కాశీంపూర్ తండా**

### అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కాశీంపూర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం చేయాలని రైతుల సమక్షంలో నిర్వాహకులను ఆదేశించారు. వాటిని పట్టించుకోకుండా నిర్వాహకులు బస్తాకు 42 కిలోల 500 గ్రాములు తూకం చేస్తూ అన్నదాతను నిలువునా ముంచేస్తున్నారు.



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల రిహార్సల్స్



## మూన్నాళ్ల ముచ్చట!

**వర్షానికి దెబ్బతిన్న బాల్యాతండా బీటీ రోడ్డు**

కేశంపేట, మే 31 : ఆ తండాకు కొన్నేండ్లుగా రోడ్డు లేదు. ఇటీవలె ఏర్పాటు కావడంతో ఆ గిరిజనులు తమ కల నెరవేరిందని సంబురపడ్డారు.. కొన్ని రోజులు కూడా గడవకముందే ఇటీవల కురిసిన వానకు ఆ రోడ్డు దెబ్బతిన్నది. మండలంలోని తొమ్మిదిరేకుల పెట్రోల్ బంక్ నుంచి బాల్యాతండాకు వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డును ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి మూడు నెలల కిందట నిర్మించారు. రహదారి ఏర్పాటైందన్న ఆనందం గడవకముందే చిన్నపాటి వర్షానికే బీటీ రోడ్డుకు పగుళ్లు వచ్చాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతోనే రోడ్డుకు పగుళ్లు వస్తున్నాయని.. భారీ వర్షాలు కురిస్తే రోడ్డు మరింత దెబ్బతినే ప్రమాదముందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

# చేపపిల్లల పంపిణీ ఎప్పుడో..?

**మే నెల దాటినా ఊసేలేని టెండర్ల ప్రక్రియ**

- ఈ ఏడాది కూడా చేప పిల్లలను చెరువుల్లోకి వదలరా..?
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు
- తమ ఉపాధిని దెబ్బ తీయొద్దని ప్రభుత్వానికి వినతి
- గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి మే నెలలో చేప పిల్లలను కొనేందుకు టెండర్లకు ఆహ్వానం
- మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూత

**మత్స్యకారుల ఉపాధిని ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా మత్స్యకారులు వాటిని పెంచి.. విక్రయించి మంచి లాభాలు గడించారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటివరకూ చేపపిల్లల పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియకు ఊసే లేదు. ఈ ఏడాది కూడా చెరువుల్లో చేప పిల్లలను ప్రభుత్వం వదులుతుందా..? లేదా..? అనే అనుమానాలు మత్స్యకారుల్లో వ్యక్తమవుతున్నాయి. -ఇబ్రహీంపట్నం, మే 31**

రంగారెడ్డి జిల్లాలో చెరువులు, కుంటలు సుమారు వెయ్యి వరకు ఉన్నాయి. వాటి విస్తీర్ణం సు మారు 15 వేల హెక్టార్ల వరకు ఉంటుంది. జిల్లాలో 210కి పైగా మత్స్యకార సహకార సంఘాలున్నాయి. అందులో 15,000 మంది చేపలు పట్టి, విక్రయించి ఉపాధిని పొందుతున్నారు. 2016-17లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకా రం చుట్టింది. అప్పటి నుంచి క్రమం తప్పకుం డా ప్రతిఏటా మత్స్యకార సొసైటీలకు ఉచితం గా చేపపిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసింది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వేలాది మంది మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటుతు న్నా చేప పిల్లలను పంపిణీ చేయడంలేదని.. మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నేటికీ ఊసేలేని టెండర్ల ప్రక్రియ..

ప్రతి ఏడాది మే నెలలోనే చేపపిల్లలను కొనేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టెండర్లు పిలిచేది. వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరగానే మత్స్యకారులకు ఆ శాఖ అధికారులు వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూ ర్తైనా ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. చేప పిల్లల కొనుగోలుకు టెండర్లు పిలవాల్సి ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడంలేదని.. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లల పంపిణీ లేనట్టేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనోపాధిని దెబ్బతీయొద్దని.. ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

### నైరుతి రుతుపవనాలతో ముందుగానే వర్షాలు..

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో వర్షాలు ప్రారంభమై ఇప్పటికే అన్నదాతలు పొలంబాట పట్టారు. జలాశయాల్లో నీరు చేరే సమయానికి ఉచిత చేప పిల్లలను వదిలే అవకాశం ఉంటుందో, లేదో అన్నది అనుమానంగా ఉన్నది. నేటికీ చేప పిల్లల టెండర్ల ప్రక్రియ మొదలు కాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన మొదలైంది. ఏటా జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేపపిల్లల పంపిణీ జరిగేది. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఈ సమయంలో చేపపిల్లలను వదిలితే అవి చక్కగా ఎదిగేందుకు అవకాశం ఉంటుండడంతోపాటు ఎదిగిన చేపల విక్రయాల ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. ఆలస్యంగా చేస్తే చేపలు ఎదగడం కష్టమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లలను పంపిణీ చేస్తున్నారని, దాంతో చేపపిల్లలు ఎదగడం లేదన్న ఆరోపణలున్నా నేపథ్యంలో.. ప్రభుత్వం మత్స్యకార సొసైటీల్లో నేరుగా డబ్బులు జమచేస్తే ఆరోగ్యకరమైన చేప పిల్లలను కొంటామని మత్స్యకారులు పేర్కొంటున్నారు.



### సొసైటీ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి



టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. దాంతో అవి సరిగ్గా ఎదగడం లేవు. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నేరుగా మత్స్యకారుల సొసైటీ ఖాతాల్లో డబ్బులు జమచేస్తే.. మత్స్యకారులు నాణ్యమైనవి కొనుగోలు చేసి చెరువుల్లో వదిలితే మంచిగా ఉంటుంది.

**-చెనమోని శంకర్, మత్స్యకార సంఘం జిల్లా నాయకుడు**

